క్లుప్తంగా

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

చీరాల అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు మూడు నెలల పాటు పట్టణంలోని వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ రమణమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డేటా ఎంట్రీ ఆపరేటర్, టైలరింగ్‌లో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి పాస్, ఫెయిల్ అయి 35 ఏళ్ల వయస్సు గల యువతీ, యువకులు అర్హులని తెలిపారు. శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నట్లు కో ఆర్డినేటర్ ఎం.హారిక తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

సంతమాగులూరు (అద్దంకి రూరల్): సంతమాగులూరు మండలంలోని పాతమాగులూరు గ్రామానికి చెందిన జిర్రా సుబ్బారావుకు గురువారం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పానెం చిన హనిమిరెడ్డి ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన రూ. 60 వేల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో సంతమాగులూరు మండలానికి చెందిన నాయకులు ఉన్నారు.

చేపల చెరువుల్లో కోళ్ల వ్యర్థాలు వేయడం నేరం

అద్దంకి రూరల్: చేపల చెరువుల్లో కోళ్ల వ్యర్థాలు వేయడం చట్టరీత్యా నేరమని చీరాల మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బీ. కృష్ణకిషోర్ అన్నారు. గురువారం మండలంలోని శింగరకొండపాలెం సచివాలయం వద్ద చేపల చెరువుల రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఏపీఎస్ఏడీఏ 2020 నిబంధనలు పాటించాలన్నారు. చట్టప్రకారం నిబంధనలు ఉల్లంఘించిన రైతులకు లైసెన్స్‌లు రద్దు చేస్తారన్నారు. అంతేకాకుండా చెరువులో ఉన్న చేపలను సీజ్ చేయటం, లేదా రూ.50 వేల జరిమానా విధిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఏ తిరుపతయ్య, కార్యదర్శి మస్తాన్‌వలి, వీఎఫ్ఏ మస్తాన్‌వలి, బాలకృష్ణ, అంకమ్మరావు, రైతులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణ కోసం కళాజాత



యద్దనపూడి: ఎయిడ్స్ అంటువ్యాధి కాదని అంటించుకునేదని.. వివాహేతర సంబంధాలతోనే ఎయిడ్స్ వస్తుందని లింక్ వర్కర్స్ స్కీమ్ జిల్లా అధికారి గాలి స్వరూప్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని పూనూరు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు కళాజాతర నాట్యమండలి రత్నరాజు బృందంచే కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఎయిడ్స్ ఎలా వస్తుంది, అలైంగిక సంబంధంలో కండోమ్ వాడకం, సుఖ వ్యాధులు, టీబీ తదితర అంశాలపై నాటకరూపంలో ప్రదర్శించారు. కార్యక్రమంలో లింక్‌వర్కర్ స్కీమ్ నాగమల్లేశ్వరి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆంగ్లభాషపై పట్టుతో అవకాశాలు



అద్దంకి రూరల్: ఆంగ్లభాషపై పట్టు సాధిస్తే భవిష్యత్‌లో మంచి అవకాశాలు ఉంటాయని ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జి ఎస్ షర్మిలారాణి అన్నారు. గురువారం స్థానిక కేఆర్కే కళాశాల ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ మోహన్‌రావు ఆధ్వర్యంలో ఆంగ్లభాష సాహిత్యం, ఉపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా షర్మిలారాణి మాట్లాడుతూ ఆంగ్లభాషలో నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటే భవిష్యత్తుకు మంచి బాటలు వేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల అడ్మిషన్ కోఆర్డినేటర్, సాతులూరి దాస్, జేకేసీ మెంటర్ వినుకొండ రమేష్, కళాశాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాపై అప్రమత్తత అవసరం

చీరాల రూరల్: మానవ అక్రమ రవాణాపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ డేవిడ్‌సన్ సాల్మన్ పేర్కొన్నారు. షాడోస్ స్వచ్ఛంద సేవా సంస్థ 35 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం సాల్మన్ సెంటర్‌లోని షాడోస్ ఆవరణలో హెచ్ఐవీ, మానవ అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థ ఏర్పాటు చేసి ఎంతోమంది హెచ్ఐవి బాధితులకు వైద్య సేవలు అందించడంతో పాటు వారికి కావాల్సిన పౌష్టికాహారాన్ని అందిస్తున్న డాక్టర్ డేవిడ్‌సన్ సాల్మన్‌ను, రాజా సాల్మన్‌ను అభిందించారు. కార్యక్రమంలో పాల్ రమేష్, పాల్‌రాజు, లూథర్‌పాల్, ఏసోబు, సీమోను, బి. భాగ్యలక్ష్మి, అలేఖ్య పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

అద్దంకి రూరల్: అద్దంకి పట్టణ శివారులో నల్లవాగు బ్రిడ్జి సమీపంలో కాలువలో గుర్తుతెలియని మృతదేహం లభించింది. ఎస్సై నాగరాజు వివరాల మేరకు.. నల్లవాగు బ్రిడ్జికి తూర్పువైపున 500 మీటర్ల దూరంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కాలవలో తేలియాడుతూ కనిపించింది. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం



బల్లికురవలో సేవావజ్ర అవార్డు ప్రభావతికి అందిస్తున్న సమన్వయకర్త చిన హనిమిరెడ్డి



కారంచేడులో వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీలు

- వలంటీర్లను చంద్రబాబు, పవన్ కళ్యాణ్ అవమానించటం దారుణం
- పురస్కారాలు అందించిన సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి

బల్లికురవ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలో ప్రకటించిన సంక్షేమ పథకాలు కుల మత పార్టీలకు అతీతంగా అర్హులందరికీ అందించడంలో వలంటీర్ల సేవలు ప్రశంసనీయమని అద్దంకి వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. గురువారం బల్లికురవలో 20 సచివాలయాలో పనిచేస్తున్న 265 మంది వలంటీర్లకు పురస్కారాలతో సత్కరించారు. ఈ సందర్భంగా హనిమిరెడ్డి మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలవటంతో ఇతర రాష్ట్రాల్లో సైతం వలంటీర్ల ఎంపికకు కసరత్తు జరుగుతోందన్నారు. ఐదేళ్లుగా చేసిన సేవలను గుర్తిస్తూ జగనన్న ప్రతి ఏడాది సేవావజ్ర, సేవారత్న, సేవా మిత్రలుగా ఎంపికతో పురస్కారాలు అందించటం మరుపురాని అనుభూతి అన్నారు. కరోనా విపత్తులో అందించిన సేవలు అమోఘమని ప్రతి పక్షాలైన చంద్రబాబు, దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్ కళ్లుండి చూడలేని ధృతరాష్ట్రునివలె అవాకులు చవాకులతో విమర్శించటం హేయమైన చర్య అన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధులైన మీరంతా సంక్షేమ పథకాలను క్లస్టర్ పరిధిలోని ప్రజలందరికీ వివరిస్తూ మద్దతు కోరాలన్నారు. జగనన్నను రెండోసారి ముఖ్యమంత్రిగా తనను అద్దంకి ఎమ్మెల్యేగా ఓట్లతో గెలిపించాలని, జీవితాంతం మీ అందరికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

వలంటీర్ రమేష్‌బాబును అభినందించిన హనిమిరెడ్డి..

తల్లి మందలించటంతో పురుగు మందుతాగి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తిని ముక్తేశ్వరం సచివాలయం పరిధిలోని రామాంజనేయపురం సీ–1 క్లస్టర్ వలంటీర్ బత్తుల రమేష్‌బాబును హనిమిరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్న వ్యక్తిని రక్షించడం కోసం వలంటీర్ రమేష్‌బాబు మరొకరి సాయంతో 35 కిలోమీటర్ల దూరంలో నరసరావుపేట వైద్యశాలకు తీసుకెళ్లి ప్రాణాలను రక్షించాడు. అయితే విధి వెంటాడటంతో వారం రోజులు మృత్యువు పోరాడి చనిపోయినట్లు చెప్పారు. ఆ తదుపరి గోపి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం చేసినట్లు వివరించారు. ఈ విషయంలో రమేష్‌బాబు అందించిన సేవలను హనిమిరెడ్డితో పాటు మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు తోటి వలంటీర్లు కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో వై హనుమారెడ్డి, ఈవోఆర్డీ దాసరి సుమ, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, ఉపాధ్యక్షుడు ఐవీ సుబ్బారెడ్డి, జేసీఎస్ అధ్యక్షుడు టి నరేష్, ఎంపీటీసీ టి. రాహేలు పార్టీ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లి అంజనీ ప్రసాదరెడ్డి, వల్లాపల్లి, కె రాజుపాలెం సొసైటీ అధ్యక్షుడు మంచాల శ్రీనివాసరెడ్డి, ఒంగోలు సుబ్బారావు, మాజీ జెడ్పీటీసీ జే మాతయ్య, సర్పంచ్‌లు ఎంపీటీసీలు పాల్గొన్నారు.



వలంటీర్ రమేష్‌ను అభినందిస్తూ జరిగిన విషయం తెలుసుకుంటున్న హనిమిరెడ్డి

కారంచేడులో..

కారంచేడు: రాష్ట్రంలో ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను త్వరగా అందించాలనే సంకల్పంతో సీఎం జగన్ ప్రారంభించిన వలంటీరు వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు అన్నారు. గురువారం ఆయన మండల పరిషత్ సమావేశపు హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉత్తమ సేవలందించిన వలంటీర్లను సత్కరించారు. మండలంలోని కుంకలమర్రు, కారంచేడు 1,2,3, ఆదిపూడి క్లస్టర్‌లలోని 84 మంది వలంటీర్లకు ప్రభుత్వం నుంచి వచ్చిన ప్రశంస పత్రాలను బహుకరించి, శాలువాలతో సత్కరించారు. సేవారత్నకు 5, సేవామిత్రలుగా 79 మందిని ఎంపికయ్యారని ఎంపీడీఓ తెలిపారు. జెడ్పీటీసీ సభ్యురాలు యార్లగడ్డ రజనీశ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు, ఎంపీడీవో బీ బాబూరావు, కార్యాలయ ఈఓ పీ లక్ష్మీనారాయణ, సర్పంచ్ ఎస్ నాగరాజు, కే సుబ్బారెడ్డి, కే కృష్ణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



వలంటీర్లను పురస్కారంతో సత్కరిస్తున్న సమన్వయకర్త వెంకటేష్

నిరంతర సేవకులు వలంటీర్లు

- వలంటీర్లను సత్కరించడం మన బాధ్యత
- నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్

చీరాల: ప్రభుత్వం వారికి ఇచ్చేది కేవలం గౌరవ వేతనం మాత్రమే.. కానీ వారికి ప్రజలు, ప్రభుత్వం సొంత గడ్డపై ఉన్న మమకారంతో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందించిన ఘనత వలంటీర్లకే దక్కుతుందని చీరాల వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్ పేర్కొన్నారు. చీరాల రూరల్ మండలంలోని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న గ్రామ వలంటీర్లకు పురస్కారాల పంపిణీని గురువారం ఓపటీలో నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సొంత ఖర్చులతో రాష్ట్రాలు, జిల్లాలు దాటి లబ్ధిదారులకు పింఛన్లు, వైఎస్సార్ బీమా రెన్యూవల్స్ చేయించిన సేవానిరతి వారిదని తెలిపారు. రాజకీయాలకు సంబంధం లేకుండా ప్రతి ఇంటి గుమ్మం తొక్కుతూ పండుటాకులు, దివ్యాంగులకు, వితంతువులకు అవ్వా అంటూ ఆప్యాయంగా పలకరించే వలంటీర్లను సత్కరించుకోవడం మన బాధ్యతన్నారు. ప్రతీ నెల ఒకటో తేదీ తెల్లవారుజాము నుంచే పింఛన్లు ఇంటి ముంగిటకే అందిస్తూ ఆ కుటుంబంలో సభ్యుడిగా ఉంటూ ప్రభుత్వ పథకాలు అందిస్తున్న వలంటీర్లు నిజంగా స్టార్ క్యాంపెయినర్లేనన్నారు. 50 ఇళ్లలో ఏ కుటుంబానికి ఏ ధ్రువీకరణ పత్రం కావాలన్నా, ఏ పథకం అందించాలన్నా వలంటీర్లే కీలకపాత్ర పోషిస్తున్నారు. పింఛన్లు పంపిణీకి రాష్ట్రాలు దాటి వెళ్లి పింఛన్లు అవ్వా, తాతలకు అందిస్తు మనవళ్లుగా నిలిచి పేరుగాంచిన వలంటీర్లు. గత ప్రభుత్వం హయాంలో పథకాలు అందాలంటే కార్యాలయాలు, కమిటీల చుట్టు తిరగాలి, కాని జననేత సీఎం వైఎస్ జగనన్న వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి దేశంలోనే ప్రత్యేకత చాటుకున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం జగనన్నకు అందరం అండగా నిలవాల్సిన సమయం వచ్చిందని ప్రభుత్వ పథకాలు, సంక్షేమాన్ని ప్రజలకు వివరించే క్యాంపెయినర్లుగా ఉండాలన్నారు. చీరాల రూరల్ మండలంలో 438 వలంటీర్లలో ఒక్కరికి సేవా వజ్ర, ఐదుగురికి సేవా రత్న, 432 మందికి సేవా మిత్ర పురస్కారాలు, ప్రోత్సాహక నగదు రివార్డులను వెంకటేష్ అందించారు. కార్యక్రమానికి ఎంపీడీవో శోభారాణి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ మురళీబాపూజీ, ఏవో శ్రీనివాస్, కార్పొరేషన్ డైరెక్టర్ జి.శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు ఆసోది అంకాళరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బుర్ల సాంబశివరావు, పీఏసీఎస్ చైర్మన్ బి.కేశవులు, పార్టీ నాయకులు బిట్రా శ్రీనివాసరావు, అక్కల శ్రీనివాసరెడ్డి, ఎం. సువార్త, సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు, పార్టీల నాయకులు పాల్గొన్నారు.



పురస్కారాల వేడుకలకు హాజరైన వలంటీర్లు

మనందరి లక్ష్యం వైఎస్సార్ సీపీ విజయం



సమన్వయకర్త యడం బాలాజీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎంపీపీ అంకమ్మరెడ్డి

- నియోజవర్గ సమన్వయకర్త యడం బాలాజీ

కారంచేడు: వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా క్షేత్ర స్థాయిలో ప్రతి కార్యకర్త నుంచి నాయకుడి వరకు కష్టపడి పనిచేయాలని ఆ పార్టీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త యడం బాలాజీ అన్నారు. గురువారం ఆయన చీరాలలోని స్వగృహంలో కారంచేడుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులతో సమావేశం అయ్యారు. గ్రామాల్లోని ప్రతి ఒక్కరూ కింది స్థాయి నుంచి కష్టపడి పనిచేయాలన్నారు. జగనన్నను మళ్లీ సీఎంను చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరం కృషి చేద్దామన్నారు. ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు పార్టీ విజయానికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు, వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు, మాజీ వైస్ ఎంపీపీ వై వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ దండా చౌదరిబాబు, ఆదిపూడి సర్పంచ్ నాగరాజు, పార్టీ నాయకులు యార్లగడ్డ పాపారావు, కారుమూడి సుబ్బారెడ్డి, చల్లా అప్పిరెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకుడు సీ సుధాకర్, మీరయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బాలాజీని చినగంజాం ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి, పలువురు నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందించారు.



సమన్వయకర్త బాలాజీతో ఎంపీపీ వాసుబాబు, నాయకులు

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

బల్లికురవ: సీజనల్ జ్వరాలు వ్యాధులు సోకకుండా మండలంలోని కొణిదెన గ్రామంలో నాలుగు రోజులుగా పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరంగా చేపడుతున్నారు. ఇటీవల బల్లికువరలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పీ. రంజిత్ బాషాకు మండలంలో ఏడు గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించిందని ఆయా గ్రామాల ప్రజలు అర్జీలు సమర్పించారు. తక్షణమే ఆయా గ్రామాల్లో పనులు చేపట్టాలని కలెక్టర్ ఎంపీడీవో హనుమారెడ్డి, ఈవోఆర్డీ సుమతి, సెక్రటరీలను ఆదేశించారు. కొణిదెన గ్రామం ఎస్సీ, బీసీ కాలనీలో సర్పంచ్ కె. లేపాక్షి విష్ణు, సెక్రటరీ సీహెచ్ వరప్రసాదరెడ్డి, పర్యవేక్షణలో వ్యర్థాలను, సైడుకాలువలోని మురుగును తరలించారు. సత్వరమే స్పందించి పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇచ్చినందుకు సర్పంచ్, సెక్రటరీలకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.



సైడు కాలువల్లో మురుగు తొలగిస్తున్న కార్మికులు

బీఎస్పీ ఆధ్వర్యంలో కరపత్రాల ఆవిష్కరణ

చీరాల రూరల్: బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం విజయనగర్ కాలనీలోని డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ విగ్రహం వద్ద డాక్టర్ కత్తి పద్మారావు రచించిన 'ఈ దేశం మాది' అనే పుస్తకావిష్కరణకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా బీఎస్పీ నాయకులు దుడ్డు భాస్కరరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ ఆధ్వర్యంలో మార్చి రెండో తేదీన గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో 'ప్రత్యామ్నాయ సంస్కృతి మేళా–ఈ దేశం మాది' అనే పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి దళితే మేధావులు, అంబేడ్కర్ వాదులు, ప్రజాస్వామ్య వాదులు, ఉద్యమ నాయకులు అధికా సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో తేళ్ల వెంకటస్వామి, గొర్రెపాటి రవికుమార్, మార్క్, చౌదరి, నాగభూషణం, సురేష్, ముసలయ్య, లక్ష్మయ్య, జయరాజు, తదితరులు పాల్గొన్నారు.

27న అద్దంకిలో ఉచిత మెగా జాబ్‌మేళా

అద్దంకి: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 27న ఉచిత జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పార్టీ కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ జాబ్‌మేళా కార్యక్రమాన్ని అద్దంకి పట్టణంలోని ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఉదయం 9.30 గంటలకు ప్రారంభించనున్నట్లు తెలిపారు. మేళా కార్యక్రమంలో పేటీఎం, కల్లం, ఆస్టోటెక్, నియాన్ లెన్స్ మణిపురం, ఏపీ మ్యాన్‌పవర్ సొల్యూషన్స్, టీవీఎస్, ముత్తూట్ ఫైనాన్స్, డైకిన్, షిర్డీసాయి ఎలక్ట్రానిక్స్, స్కిల్ సోనిక్ ప్రైవేట్ లిమిటెడ్, ఇన్నోవా సోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతీ, యువకులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

కాపు సంక్షేమసేన అధ్యక్షుడిగా సందీప్‌తేజ



సందీప్‌తేజ

చినగంజాం: పర్చూరు నియోజకవర్గ కాపు సంక్షేమ సేన అధ్యక్షుడిగా పర్చూరుకు చెందిన కారంపూడి సందీప్‌తేజ నియమితులయ్యారు. ఈమేరకు బాపట్ల జిల్లా అధ్యక్షుడు తరణి గోపాలకృష్ణ నుంచి గురువారం ఉత్తర్వులు అందాయని సందీప్ తెలిపారు.

ఉపాధ్యక్షుడిగా అనిశెట్టి నరేంద్రకుమార్, నారిశెట్టి రవితేజ, తెలగనేని వెంకటేష్, మేరువ రాయుడు, ప్రధాన కార్యదర్శిగా తోటా మణికుమార్, సంయుక్త కార్యదర్శిగా అడుసుమల్లి హరిబాబు, కన్వీనర్ చిమటా హనుమంతరావు, కో కన్వీనర్‌గా కోడె లక్షణ్‌లు నియమితులయ్యారు.

స్పందన అర్జీల విచారణలో అలసత్వం తగదు

చీరాల టౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలోగా విచారించి పరిష్కరించాలని తహశీల్దార్ కె.నాసరయ్య సూచించారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో గ్రామ, పట్టణ రెవెన్యూ అధికారులతో స్పందన అర్జీలపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు సత్వరంగా ప్రభుత్వ సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన స్పందనలో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలన్నారు. రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. గ్రామాల్లో, సచివాలయాల్లో పనిచేసే వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు స్పందన అర్జీలను త్వరగా విచారించాలన్నారు. గ్రామాల్లో ఎక్కడా కూడా అనధికార లే అవుట్లు వేయకుండా కట్టడి చేసి, నీటి తీరువా వసూళ్లు చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ పి.సురేష్ కుమార్, రీసర్వే టీడీ అర్జున్, ఆర్ఐ శేఖర్, వీఆర్వోలు ఉన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ అడహక్ కమిటీ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేయిస్తున్న తహశీల్దార్ నాసరయ్య

చీరాల టౌన్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చీరాల బ్రాంచ్ అడహక్ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారాన్ని గురువారం నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన అడహక్ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారంలో చీరాల రెడ్‌క్రాస్ సొసైటీ బ్రాంచ్ అధ్యక్షుడు కె.నాసరయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. సభ్యులుగా డాక్టర్ కె.శ్రీనివాసరెడ్డి, ఎం.మణికుమార్, జి.మల్లికార్జునరావు, డి. ఇమ్మానియేల్, కె.రవికుమార్, ఎ.సుబ్బారావు, బి.శశికిరణ్‌లతో తహశీల్దార్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ సమాజ సేవలో ముందుండాలన్నారు. నూతన కమిటీని పలువురు అభినందించారు.

వైభవంగా జానకీరామాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట

చీరాల: పట్టణంలోని జవహర్‌నగర్‌లోని జానకీ రామాంజనేయస్వామి దేవాలయంలో పాలరాతి విగ్రహాల ప్రతిష్ట మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో గురువారం వైభవంగా నిర్వహించారు. పండితుల మంత్రోచ్చరణలతో పాలరాతి విగ్రహాలకు గ్రామోత్సవం అనంతరం ప్రతిష్ఠించారు. ఈవేడుకలకు ముఖ్య అతిథిగా నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కరణం వెంకటేష్ హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థానం పండితులు వెంకటేష్‌తో ప్రత్యేక పూజలు చేయించారు. నియోజకవర్గ ప్రజలందరు సుఖసంతోషాలతో జీవించడంతో పాటుగా మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని, నియోజకవర్గ ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు కీర్తి వెంకటరావు, బత్తుల అనీల్, కంపా అరుణ్, దేవస్థాన కమిటీ ప్రెసిడెంట్ ఉదయ ప్రసాద్, వి.శ్రీనివాసరావు, జె.శ్రీనివాసరావు, టి.శ్రీనివాసరావు, రాజేష్, రాము, పూర్ణచంద్రరావు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త వెంకటేష్

ఘనంగా మదనగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

చీరాల అర్బన్: పట్టణంలోని పేరాలలో వేంచేసియున్న రుక్మిణి సత్యభామా సమేత మదనగోపాల స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలను వైఖానస ఆగమం ప్రకారంగా త్రయాహ్నికంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం ధ్వజారోహణం, నిత్య బలిహరణ నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై ఉంచి పట్టణంలో నగరోత్సవం నిర్వహించారు. ఈనెల 25వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి బండ్ల శ్రీలత తెలిపారు. కార్యక్రమంలో యాజ్ఞిక స్వామి తమిరిశ వంశీకృష్ణ, దేవాలయ 14వ వ్యవస్థాక ధర్మకర్తలు జక్కా రమేష్, డాక్టర్ జక్కా మోహన మురళీధరరావు, అర్చకులు ఆర్‌వీ రంగాచార్యులు, ఆర్‌వి చెన్నకృష్ణమాచార్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



గరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామి వారు

ఉచిత సామూహిక ఉపనయనం

అద్దంకి: కనిగిరి ప్రాంత విశ్వబ్రాహ్మణ పురోహిత పరిషత్ ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణ యువకులకు ఈ నెల 29న ఉచిత సామూహిక ఉపనయన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసరాచారి చెప్పారు. స్థానిక విశ్వబ్రాహ్మణ సంఘ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించి కార్యక్రమ వివరాలు వెల్లడించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపనయన కార్యక్రమం కనిగిరిలోని సాయి మణికంఠ హార్డ్‌వేర్ షాప్‌లో ఉదయం 6 గంటలకు ప్రారంభిస్తారని తెలిపారు. అర్హులైన ప్రకాశం జిల్లా యువకులు ఈనెల 25లోపు ఉపనయన కార్యక్రమ నిర్వహణ ప్రధాన కర్త వేద పురోహితుడు బ్రహ్మశ్రీ ఆకుమళ్ల మోహన్ 99493 64775కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈనెల 28 సాయంత్రం కనిగిరిలోని వీరబ్రహ్మేంద్రస్వామి వారి దేవాలయం ప్రాంగణం వద్దకు చేరుకోవాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి పొన్నపల్లి బ్రహ్మానందం, జిల్లా యూత్ అధ్యక్షుడు తువ్వాపాటి జనార్దనాచారి, చింతలపూడి వీరయ్యాచారి, ఏలూరు వీరబ్రహ్మాచారి ఉన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసాచారి

ప్రజల అండదండలే వైఎస్సార్ సీపీకి బలం



ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడుతున్న చిన హనిమిరెడ్డి

సంతమాగులూరు (అద్దంకి రూరల్): ప్రజల అండదండలు వైఎస్సార్ సీపీకి పుష్కలంగా ఉన్నాయి.. వారే పార్టీకి బలం అని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. గురువారం రాత్రి సంతమాగులూరు మండలంలోని సంతమాగులూరు ఎస్సీ కాలని, కొమ్మాలపాడు గ్రామాల్లో «పల్లెపల్లెకు హనిమిరెడ్డి అన్న₹ కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి విచ్చేసిన హనిమిరెడ్డికి గ్రామస్తులు డప్పులతో ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా గ్రామంలోని ఇంటింటికి తిరుగుతూ ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హనిమిరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి సుపరిపాలన అందించటం వల్లే ప్రజలు నేడు సిద్ధం సభలకు పోటెత్తుతున్నారన్నారు. నియోజవర్గంలో మూడు సార్లు గెలిచిన ఎమ్మెల్యే అద్దంకిలో ఎటువంటి అభివృద్ధి చేయలదన్నారు. ఐదేళ్ల అధికారాన్ని అడ్డుపెట్టుకుని పార్టీకి వెన్నుపోటు పొడిచిన నాయకులను ప్రజలు నమ్మే పరిస్థితులు లేరని అన్నారు. రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని, అద్దంకి ఎమ్మెల్యేగా తనను ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.